క్లుప్తంగా

దుర్గారావుకు మంత్రి విశ్వరూప్ అభినందన



దుర్గారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కమిటీ కన్వీనర్‌గా నియమితులైన గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన చప్పిడి దుర్గారావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. మంత్రి విశ్వరూప్‌ను కన్వీనర్ దుర్గారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల పనితీరును ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి విశ్వరూప్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మోటూరి సత్యంకాపు, మారిశెట్టి పుండరీకాక్షుడు, జొన్నాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకాలపేటలో అవుట్ రీచ్ ప్రోగ్రామ్

యానాం: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కనకాలపేట గ్రామంలో నిర్వహించనున్న అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో రాజ్యసభ సభ్యుడు ఎస్.సెల్వగణపతి పాల్గొననున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో కలసి కనకాలపేట, దరియాలతిప్ప, మెట్టకూరు, సావిత్రినగర్ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన వివిధ ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తారు. అనంతరం యర్రాగార్డెన్స్‌లో జీవీఎస్ ఫంక్షన్ హాలులో బీజేపీ కార్యకర్తలతో సమావేశమవుతారని బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాల రాజు, నాయకుడు కనకాల రామదాసు తెలిపారు.

నవభారత్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

అల్లవరం: అల్లవరం పోలీస్‌స్టేషన్ వద్ద 72 రోజుల పాటు చలివేంద్రాన్ని నిర్వహించి వందలాది మంది ప్రయాణికుల దాహాన్ని తీర్చిన నవభారత్ యువ నిర్మాణ సంఘ్ సభ్యులు, వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎస్‌ఐ శ్రీను నాయక్ ప్రశంసించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులకు ఎస్‌ఐ మెమోంటోలు అందించి కొనియాడారు. కార్యక్రమంలో నవభారత్ యువ నిర్మాణ సంఘ్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాగమణి, పాటి సత్తిరాజు పాల్గొన్నారు.

కాలు విరిగిన ఎద్దుకు చికిత్స

అమలాపురం టౌన్: పశువుల అక్రమ రవాణాలో ఎద్దులను వ్యాన్‌లో కుక్కేయడంతో ఓ ఎద్దు చనిపోగా మరో ఎద్దు కాలు విరిగి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో అమలాపురం రూరల్ సీఐ పి.వీరాబాబు, ఎస్‌ఐ పరదేశి ఆ ఎద్దుకు పశు సంవర్ధక శాఖ ద్వారా చికిత్స చేయించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎద్దులకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి, డాక్టర్ పూర్ణిమ, 1962 పశు అంబులెన్స్ సిబ్బంది వైద్య సేవలందించారు. అనంతరం ఆ ఎద్దులను అంబులెన్స్‌లో గోశాలకు తరలించారు. అలాగే వ్యాన్‌లో చనిపోయిన ఎద్దుకు పశు వైద్యాధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

వెంకన్న మృతి తీరని లోటు

ముమ్మిడివరం: రజక సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సామంతకుర్తి వెంకన్న మృతి తీరని లోటని రజక సంఘ అధ్యక్షుడు అయినాపురం వెంకట్రావు అన్నారు. ముమ్మిడివరంలో రజక సంఘం సభ్యులంతా సమావేశమై వెంకన్న మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సమావేశంలో ముమ్మిడివరపు రాంబాబు, కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, సామంతకుర్తి సురేష్, గొల్లపల్లి ధర్మారావు, కోటిపల్లి మోహనరావు పాల్గొన్నారు.

ఊరూరా పాల విప్లవం

- జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి
- సహకార సొసైటీల ఆధ్వర్యంలో పాల సేకరణ



గూడాలలో సహకార సొసైటీగా ఏర్పడిన మహిళా పాడి రైతులు

అల్లవరం: ప్రభుత్వం ఊరూరా పాల విప్లవానికి తెర తీసింది. దళారీ వ్యవస్థ నుంచి మహిళా పాడి రైతులను కాపాడడానికి, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న పాలవెల్లువ పథకానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పాడి రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జగనన్న పాల వెల్లువ పథకాన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో ఏర్పాటుచేసేందుకు పశు సంవర్ధక శాఖ కార్యాచరణ చేపట్టింది.

గ్రామాల్లో సొసైటీల ఏర్పాటు

గ్రామాల్లో ఆవులు, గేదెలున్న పాడి రైతులను వలంటీర్ల సర్వే ద్వారా గుర్తించి 11 మంది పాడి రైతులను ఒక సొసైటీగా ఏర్పాటుచేశారు. ఈ సంఘానికి కనీసం పదో తరగతి చదువుకుని, కంప్యూటర్ పరిజ్ఞానమున్న మహిళను కార్యదర్శిగా నియమిస్తున్నారు. ఇలా ఏర్పాటుచేసిన సొసైటీల ద్వారా పాడి రైతుల నుంచి పాలు సేకరిస్తారు. సేకరించిన పాలను సహకార సంస్థల ద్వారా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న అమూల్ కంపెనీకి సరఫరా చేస్తారు. సచివాలయాలు లేదా రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఆటోమేటెడ్ మిల్క్ కనెక్షన్ సెంటర్‌లో సహకార సొసైటీల ద్వారా సేకరించిన పాలలో వెన్న శాతం ఆధారంగా అమూల్ కంపెనీ ధర నిర్ణయిస్తుంది. పాల నాణ్యత ఆధారంగా పాడి రైతులకు పది రోజులకు ఒకసారి పాల డబ్బులను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తారు.

గేదె పాలు లీటరుకి రూ.87.42

సహకార సొసైటీ ద్వారా ఏర్పాటుచేసిన ఆటోమేటెడ్ మిల్క్ కనెక్షన్ కేంద్రాల్లో సేకరించిన పాలను అమూల్ కంపెనీ గరిష్ఠంగా గేదె పాలు లీటరుకి రూ.87.42, ఆవు పాలు లీటరుకు రూ.42.56 ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ, హెరిటేజ్ కంపెనీలతో పోల్చితే అమూల్ కంపెనీ పాడి రైతులకు ఇచ్చే ధర అధికంగా ఉందని పశు సంవర్ధక శాఖ అధికారులు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళా పాడి రైతులను ప్రోత్సహిస్తున్నారు. అమలాపురం, ముమ్మిడివరం మండలాల్లోని 34 గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ పథకాన్ని అమలుచేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	ఎంపిక చేసిన గ్రామాలు
అల్లవరం	ఎంట్రుకోన, దేవగుప్తం, గోడి, గోడిలంక, తూర్పులంక, తాడికోన, అల్లవరం-1, గూడాల, బోడసకుర్రు-1
అమలాపురం	జనిపెల్ల, తాండవపల్లి, కామనగరువు-1, ఎ.వేమవరం, భట్నవల్లి, బండారులంక-2, ఈదరపల్లి-2, పాలగుమ్మి, సాకుర్రు, నల్లమిల్లి, గున్నేపల్లి అగ్రహారం, ఇందుపల్లి-1, నడిపూడి, పేరూరు-1, సమనస, వన్నె చింతలపూడి
ఉప్పలగుప్తం	భీమనపల్లి-1, 2, సన్నవల్లి
ముమ్మిడివరం	కొత్తలంక, అనాతవరం
ఐ.పోలవరం	జి.మూలపాలెం, గుత్తినదీవి
కాట్రేనికోన	చెయ్యేరు-1, ఊప్పూడి

వెన్న శాతం ఆధారంగా ధర



గ్రామాల్లో మహిళా పాడి రైతులను సొసైటీగా ఏర్పాటుచేసి కార్యదర్శిని నియమించి వారికి కనెక్షన్ సెంటర్ బాధ్యతలు అప్పగిస్తున్నాం. పాడి రైతుల నుంచి సేకరించిన పాలలో వెన్న శాతం ఆధారంగా ధర నిర్ణయించి లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేస్తారు. ప్రతి పాడి రైతు కనీసం మూడు నెలల పాటు సరఫరా చేయవలసి ఉంటుంది.

– ఎల్.విజయారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

పాడి రైతులు లాభపడతారు



జగనన్న పాలవెల్లువ ద్వారా లీటరు గేదె పాలకు అధికంగా రూ.87, ఆవు పాలకు రూ.42 ధర చెల్లించి పాలు కొనడం వల్ల పాడి రైతులు చాలా లాభపడతారు. ఇప్పటివరకూ గ్రామాల్లో దళారులదే ఇష్టారాజ్యం. వాళ్లు ఇచ్చినంత తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వ చర్యలతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆస్కారమేర్పడుతుంది.

– వాసంశెట్టి శ్రీదేవి, పాడి రైతు, బోడసకుర్రు

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న విశాఖపట్నం రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు

అమలాపురం రూరల్: భట్లపెల్లిలోని మంత్రి నివాసంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను విశాఖపట్నం రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ తదితరులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

నవోదయకు 80 మంది విద్యార్థుల ఎంపిక

యానాం: 2023–24 విద్యా సంవత్సరానికి గాను యానాం మెట్టకూరు నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 80 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 29న నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌కు 328 మంది హాజరయ్యారన్నారు. ఎంట్రన్స్ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న పూర్తి వివరాలతో విద్యాలయకు వచ్చి అడ్మిషన్ ఫారాలు తీసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అన్నంపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



రాంజీనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు



గడప గడపకూ కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పినిపే శ్రీకాంత్

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ పరిధి దానవాయి చెరువు, రాంజీ నగర్‌ల్లో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలవారు అట్టడుగు స్థాయిలోనే ఉండేవారన్నారు. జగనన్న సీఎం అయ్యాక వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పేదల అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, పచ్చ మీడియా సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్నారన్నారు. అయితే ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత రాంజీనగర్‌లో జలజీవన్ మిషన్ ఇంటింటికీ కుళాయి పథంలో రూ.24.48 లక్షలతో నిర్మించే పైపులైన్లు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, గ్రామ సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, పాము చిట్టిబాబు, పెసింగి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

అల్లవరం: బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను నిర్విఘ్నంగా అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. తుమ్మలపల్లి, అల్లవరం సచివాయం-2 పరిధిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించిన గ్రామాల్లో రూ.20 లక్షల జీజీఎంపీ నిధులతో ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, నిచ్చెనకోళ్ల మౌనిక, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, యూత్ అధ్యక్షుడు దాసం రాంబాబు, మాజీ ఎంపీటీసీ పెమ్మాడి సాయి, బళ్ల శ్యామ్, తుట్టెపు బాబి, పులుసుగంటి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

తీర గ్రామాలకు రక్షిత మంచి నీరు



పల్లంకుర్రు పెదపేటలో వాటర్ ట్యాంకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడిన తీర గ్రామాల్లో సైతం రక్షిత మంచి నీటిని అందిస్తున్నామని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని పెదపేటలో రూ.63.25 లక్షలు, సాపేవారి పేటలో రూ.28 లక్షలు, కొత్త ఆదియాంధ్రపేటలో రూ.34 లక్షలు, మొక్కలతిప్పలో రూ.10 లక్షలు, మచ్చావారిపేటలో రూ.41.79 లక్షలు జల జీవన్ మిషన్, సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. మొక్కల తిప్పలో అంగన్‌వాడీ కేంద్రానికి జెడ్పీ నిధులు రూ.5 లక్షలు, విత్తనాలవారి కాలువ గట్టు రూ.10 లక్షలతో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గోగుల్లంక నుంచి గోదావరి పాయలో 16 కిమీ పైపు లైన్ పనులు చేపట్టి మగసానితిప్పకు రక్షిత మంచి నీటిని అందించామన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలోను మంచి నీటి సమస్య లేకుండా యుద్ధప్రాతిపదికన ట్యాంకులు నిర్మించి పైపులైన్ పనులు చేపట్టి తాగునీరిస్తున్నామని చెప్పారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థలమిచ్చిన దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మీ ధర్మారావు, జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచ్ నాతి అలివేణి, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, ఏడిది సుబ్బు, జీటీ వెంకటేశ్వరరావు, సాపే సూర్య ప్రకాష్, జనిపెల్లే శ్రీను, కృష్ణంరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ కోరారు. బుధవారం పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కుడుపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నూరు శాతం పరిష్కరించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 11 రకాల సేవలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించి, జులై 23వ తేదీ వరకూ ఆయా సేవలను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ పిల్లి వీరనాగు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



శతక రత్నావళి పుస్తకాన్ని ఆవిష్కరించిన విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, కవి దాట్ల తదితరులు

యానాం: విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేలా నేటి విద్యా విధానంలో సంస్కరణలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని ప్రముఖ కవి, కలైమామణి దాట్ల దేవదానం రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రీజెన్సీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి రూపొందించిన నైతిక విలువలతో కూడిన 'శతక రత్నావళి' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధ కవులైన వేమన, బద్దెన, సుమతి, భాస్కర, దాశరథి శతకాలు, పంచతంత్రం వంటి వాటి నుంచి ఉత్తమ కథలను సేకరించి శతక రత్నావళిని రూపొందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి మాట్లాడుతూ శతకాలను గురించి తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, తమ నడవడికను మార్చుకుని తల్లిదండ్రులను గౌరవించడం తదితర వాటిని అలవరచుకుంటారన్నారు. అనంతరం పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, కలైమామణి ముమ్మిడి వీరనాగప్రసాద్, హెచ్ఎంటీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, ఇంచార్జి వీరభద్రరావు, ఉపాధ్యాయులు ఉషాకుమారి, రాధారాణి, పుష్పకుమారి, శంకర్ పాల్గొన్నారు.

డ్వాక్రా నిధుల స్వాహాపై కేసు

అమలాపురం రూరల్: అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో 30 డ్వాక్రా సంఘాల సభ్యులకు చెందిన నిధుల దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ఆ గ్రామ చింతపల్లి సంఘం సహాయకురాలు (వీవోఏ) నెల్లి కనక దుర్గపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ బుధవారం తెలిపారు. 30 డ్వాక్రా సంఘాల స్త్రీ నిధి, బ్యాంక్ రుణాలకు సంబంధించి బ్యాంక్ కరస్పాండెంట్‌గా కనకదుర్గ రూ.44.89 లక్షల నిధులను సభ్యులకు రశీదు ఇవ్వకుండా స్వాహా చేశారన్నది అభియోగం. ఆ నిధులను వీవోఏ కనకదుర్గ దుర్వినియోగం చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. నిందితురాలిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

పద్మారావుకు ఎంపీపీ సునీత అభినందనలు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ కన్వీనర్‌గా నియమితులైన భూసారపు పద్మారావును ఎంపీపీ రాయుడు సునీత అభినందించారు. తనను మర్యాదపూర్వకంగా కలిసిన పద్మారావును ఎంపీపీ సునీత దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముత్యాలు, కోరంగి ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోసియ్య పాల్గొన్నారు.